క్లుప్తంగా

వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి

భీమవరం(ప్రకాశం చౌక్): జువ్వలపాలెం రోడ్డులోని పద్మావతీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాల్లో శుక్రవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక యాగాలు, పూజలను ఆలయ అర్చకులు నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి వారిని, అమ్మవారిని భీమవరం మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, వాడపల్లి వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానం డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు దంపతులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మంతెన రామ్‌కుమార్ రాజు, ఆలయ కార్య నిర్వహణాధికారి ముదునూరి సత్యనారాయణరాజు, అర్చకులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

భీమవరం : కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ భీమవరం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు సమీపంలోని ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ ఇన్‌చార్జి అంకెం సీతారాం మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెంచమని అధికారంలోనికి వచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ట్రూ అప్ చార్జీల పేరుతో రానున్న రెండేళ్లలో రూ.20 వేల కోట్లు ప్రజలపై భారం వేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల కో-ఆర్డినేటర్లు గోపాలకృష్ణంరాజు, హరికిరణ్, సతీష్, కడలి రామారావు, వంశీరెడ్డి, డి.రామకృష్ణ, సోము నాగకేశవ్‌బాబు, మద్దాల సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

మల్లేశ్వరునికి చక్కెర అభిషేకం

ఉండి: కార్తీకమాస పర్వదినాలను పురస్కరించుకుని స్థానిక రాజులపేటలో ఉన్న పార్వతీసమేత చెన్నమల్లేశ్వరస్వామికి శుక్రవారం చెక్కరతో అభిషేకం కార్యక్రమాలను నిర్వహించారు. ఏడో రోజు పూజా కార్యక్రమాల్లో భాగంగా చక్కెర అభిషేకాన్ని నిర్వహించారు. ఈ విధంగా భక్తులు చక్కెరతో స్వామివారికి అభిషేకం చేయడం ద్వారా సర్వబాధల నుండి సర్వే రోగాల నుండి విముక్తి కలుగుతుందని ప్రధానార్చకుడు సన్నిధిరాజు కృష్ణ తెలిపారు. కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో అర్చకులు సన్నిధిరాజు చలపతిరావు, ఏలూరు ఫణిశర్మ, తాడేపల్లి కిరణ్‌శ్వర్మ పాల్గొన్నారు.

శిక్షణాధికారులకు సహకరించాలి

ఉండి: ఐఏఎస్, ఐఆర్ఎస్, ఐఎఫ్ఎస్ ట్రైనీ అధికారులు ఈ నెల 11న మండలానికి శిక్షణ నిమిత్తం రానున్న దృష్ట్యా అధికారులంతా తప్పక సహకరించాలని ఎంపీడీఓ ఎస్.రవీంద్ర, తహసీల్దార్ కె.నాగార్జున అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఉండి మండలం మహదేవపట్నం గ్రామంలో వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సోమవారం మండలంలోని మహదేవపట్నం, కాళ్ల మండలంలోని మరో గ్రామానికి ఐదురుగు చొప్పున ఐఏఎస్, ఐఆర్ఎస్, ఐఎఫ్ఎస్ ట్రైనీ అధికారులు గ్రామ పాలనపై శిక్షణకు విచ్చేస్తున్న దృష్ట్యా అన్ని శాఖల అధికారులు వారికి అవసరమైన సమాచారాన్ని అందించేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఏదైనా అనుమానం తలెత్తితే దానిని నివృత్తి చేసేలా అధికారులు పూర్తి సమాచారం తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ వనిమా సుబ్బలక్ష్మీ శ్రీనివాస్, ఉపసర్పంచ్ ముదునూరి సుబ్బరాజు, కార్యదర్శి కె.గోపాలకృష్ణ, వీఆర్వో ఎస్.చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

108లో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం

కాళ్ల: 108 వాహనంలో మహిళ ప్రసవించి మగ బిడ్డకు జన్మనిచ్చింది. మండలంలోని కలవపూడి శివారు మోడి గ్రామానికి చెందిన బి.జ్యోతికి శుక్రవారం పురిటినొప్పులు మొదలయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే 108కి సమాచారం అందించారు. ప్రసవ వేదన భరిస్తున్న తల్లిని 108 వాహనంలో కాళ్ళ ప్రభుత్వ అసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో కలవపూడి గ్రామ శివారులో ప్రసవించింది. అనంతరం తల్లిబిడ్డను కాళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వాహనంలో ప్రసవం చేసి తల్లిని, బిడ్డను కాపాడిన 108 ఈఎంటీ ఏసుబాబు, పైలెట్ పూర్ణచంద్రరావు తదితరులకు జ్యోతి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

నిత్యాన్నదానానికి విరాళం

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణ ఇలవేల్పు మావుళ్లమ్మ ఆలయంలో శాశ్వత నిత్యాన్నదానానికి శృంగవృక్షం గ్రామానికి చెందిన కొప్పుల సరస్వతి రూ.1,00,116 విరాళం అందజేశారని సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మీ నగేష్ తెలిపారు. ఆలయ అర్చకులు కొప్పేశ్వరరావు అమ్మవారికి పూజలు నిర్వహించి, ప్రసాదాలు అందజేశారు.

ప్రశ్నార్థకంగా స్లూయిజ్ నిర్మాణ పనులు



దొంగపిండిలో బందాల చేడు శివారులో నిర్మించిన స్లూయిజ్



తుప్పు పడుతున్న తలుపులు

- నత్తనడకన బందాల చేడు డ్రెయిన్ స్లూయిజ్ పనులు
- ఏటా ఉప్పునీటితో ఇబ్బంది పడుతున్న రైతులు

భీమవరం అర్బన్: మండలంలోని దొంగపిండి గ్రామంలో బందాలచేడు డ్రెయిన్ శివారు ఉప్పుటేరులో కలిసే చోట నిర్మిస్తున్న స్లూయిజ్ పనులు ఏళ్లు గడుస్తున్నా నిర్మాణ పనులు పూర్తి కావడం లేదు. దీంతో ఈ ప్రాంతంలో కాంట్రాక్టర్, అధికారుల తీరుపై ఆక్వా రైతులు మండిపడుతున్నారు. బొండాడ డ్రెయిన్ కోటి మొగ నుంచి గూట్లపాడు, కొత్త పూసలమర్రు, దొంగపిండి గ్రామాల మీదుగా ఉప్పుటేరులో కలుస్తుంది. ఉప్పుటేరు కలిసే చోట గత పదేళ్ల క్రిందట స్లూయిజ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ డ్రెయిన్‌ను ఆనుకుని సుమారు 8 వేల ఎకరాల చేపలు, రొయ్యలు సాగు చేస్తున్నారు. ఏటా జనవరి నెలలో సముద్రం నుంచి ఉప్పునీరు రావడంతో ఈ డ్రెయిన్ ఆనుకుని సాగు చేస్తున్న భూములు చౌడు బారిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ స్లూయిజ్ నిర్మాణం చివరి అంకానికి వచ్చినా గత పదేళ్లుగా తలుపులు బిగించకపోవడంతో ఏటా రూ.కోట్లు నష్టపోతున్నామని ఆక్వా రైతులు వాపోతున్నారు.

నాలుగు దశాబ్దాల క్రితమే స్లూయిజ్

ఉప్పుటేరు డ్రెయిన్ నుంచి ఉప్పునీరు ఈ మురుగు డ్రెయిన్‌లోకి రాకుండా 4 దశాబ్దాల క్రితం అప్పటి ప్రభుత్వం డ్రెయిన్‌కు మొగలో స్లూయిజ్ నిర్మించారు. ఈ స్లూయిజ్ కాలం చెల్లడంతో శిథిలావస్థకు చేరుకుంది. ఈ స్లూయిజ్ బాగుంటే ఉప్పునీరు రాకుండా తలుపులు బిగించి, సప్పనీరు సముద్రంలోకి వెళ్లకుండా రైతులు పదేళ్ల క్రితం డెల్టా ఆధునికీకరణ పనుల్లో భాగంగా నూతన స్లూయిజ్ నిర్మించేందుకు పనులు మొదలు పెట్టారు. అధికారులు, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం వలన ఇప్పటి వరకు ఈ స్లూయిజ్ పనుల నిర్మాణం పూర్తి కాలేదు.

ఉప్పుకయ్యలుగా మారుతున్నాయి.

జనవరి నుంచి వచ్చే ఉప్పునీరు రాకుండా స్లూయిజ్ తలుపులు దింపి అడ్డుకట్ట వేయడంతో ఆ డ్రెయిన్ పరిధిలోని పంటలను రక్షించుకునే వారు. స్లూయిజ్‌లు నిర్మాణంలో ఉండటం వల్ల ఉప్పునీరు వచ్చి తీర ప్రాంత మంతా ఉప్పుకయ్యలుగా మారుతుందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా డ్రెయిన్ శాఖాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి స్లూయిజ్ నిర్మాణాన్ని పూర్తి చేసి ఈ ప్రాంత ఆక్వా రైతులను ఆదుకోవాలని కోరుకుంటున్నారు.

> **రొయ్యల సాగు చేయలేకపోతున్నాం**
>
> నేను రెండు ఎకరాల్లో ఉప్పునీటి చేపలు పెంచుతున్నాను. గతంలో సప్పనీటి చేపలు పెంచేవాళ్లం మంచి దిగుబడులు వచ్చేవి. ఇప్పుడు స్లూయిజ్ శిథిలావస్థకు చేరుకోవడంతో ఉప్పునీరు వస్తుంది. దీంతో ఉప్పుటేరు నుంచి ఉప్పునీరు కాలువలోకి వస్తుంది. సప్పనీరు లేక చేపలు, రొయ్యల సాగు చేయలేకపోతున్నాం. అంతే కాకుండా చవుడు భూములుగా మారుతున్నాయి.
>
> – బి.దుర్గారావు, రైతు, దొంగపిండి

కమ్యూనికేషన్ స్కిల్స్‌పై పట్టు సాధించాలి

భీమవరం: కమ్యూనికేస్ స్కిల్స్, ఇంగ్లీష్ భాషపై మంచి ప్రావీణ్యం సంపాదిస్తేనే ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ అన్నారు. నిషాంత్ వర్మ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులకు మొదటి సంవత్సరం నుండి ఇంగ్లీష్ భాషపై పట్టు సాధించేందుకు వివిధ విభాగాల ద్వారా విద్యార్థులకు సాఫ్ట్ స్కిల్స్‌పై శిక్షణ అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఇంచార్జి ప్రిన్సిపల్ డాక్టర్ బీహెచ్‌వీఎస్ రామకృష్ణంరాజు ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ డిపార్ట్‌మెంట్ అధ్యాపక బృందం పాల్గొన్నారు.

తాగునీటి చెరువు ప్రక్షాళన చేయాలి

వీరవాసరం: విషపురితంగా ఉన్న మత్స్యపురి పాలెం తాగునీటి చెరువును తక్షణం ప్రక్షాళన చేయాలని గ్రామపంచాయతీ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. మండల కన్వీనర్ పోతుల కృత్యుంజయ అధ్యక్షతన నిర్వహించిన సభలో జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడుతూ తాగునీటి చెరువు కలుషితమై, చేపలు చనిపోయి, కాలుష్య కోరల్లో గ్రామం ఉంటే సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. జిల్లా పంచాయతీ అధికారులు తక్షణం గ్రామాన్ని సందర్శించి వెంటనే పంచాయతీకి నిధులు కేటాయించాలన్నారు. యుద్ధ ప్రాతిపదికన మంచినీటి చెరువు మరమ్మతులు చేపట్టాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన కార్యదర్శులపై తక్షణం చర్యలు తీసుకోవాలని నరసింహమూర్తి డిమాండ్ చేశారు.

బాలల సంరక్షణ అందరి బాధ్యత



బాలల సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నకుమారి

ఆకివీడు: దేశానికి భవిష్యత్ పౌరులు బాలలేనని, వారిని స్వేచ్ఛగా ఎదగనివ్వాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నకుమారి, డీసీపీయూ సీహెచ్ విజయసత్య అన్నారు. స్థానిక సరోజినీనాయుడు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, దుంపగడపలోని జెడ్పీ స్కూల్‌లో శుక్రవారం బాలల హక్కులు, సంరక్షణ చట్టాలపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో జరిగిన సమావేశాల్లో వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమన్నారు. బాల్యవివాహాలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవన్నారు. బాల్య వివాహాల వల్ల బాలబాలికలకు శారీక, మానసిక, ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. పోక్సో చట్టం యువతికి, మహిళలకు రక్షణ చట్టమన్నారు. ఆకతాయిల వేధింపులకు గురైన, అసభ్యకరంగా ఎవరైనా ప్రవర్తించినా, దాడులు చేసినా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే పోక్సో చట్టం ద్వారా వారికి న్యాయం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు పలు చట్టాలు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ అప్మాదున్నీసా

భీమవరం: మహిళలకు రక్షణగా అనేక చట్టాలున్నాయని అపరిచితులబారిన పడి మోసపోవద్దని భీమవరం మహిళాపోలీసు స్టేషన్ సీఐ అప్మాదున్నీసా అన్నారు. భీమవరం మహిళా పోలీస్ స్టేషన్, విజ్ఞాన వేదిక సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని ఝాన్సీలక్ష్మీభాయి (జేఎల్‌బీ) మున్సిపల్ స్కూల్, శ్రీసూర్య ఒకేషనల్ జూనియర్ కళాశాల్లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. నేటి సమాజంలో సెల్ ఫోన్, ఇంటర్నెట్ మాయాజాలంతో కొంతమంది మాయమాటలు చెప్పి మోసాలకు పాల్పడుతున్నారని అటువంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. టెక్నాలజీని విద్య, ప్రాపంచిక విషయాలకు మాత్రమే ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు కలిగొట్ల గోపాల శర్మ, అల్లు శ్రీనివాస్, మునిసిపల్ హై స్కూల్ హెచ్ఎం శ్రీనివాస్, సోమేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా బొర్రా సుజాత



బొర్రా సుజాత, సభ్యులను అభినందిస్తున్న జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు పళ్ళెం అరుణకుమారి

ఆకివీడు: మహిళా సమాఖ్య ద్వారా డ్వాక్రా గ్రూపు సభ్యులు ఆర్థిక స్థిరత్వాన్ని సాధించే దిశగా నూతన కమిటీ కృషి చేయాలని జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, రాష్ట్ర కమిటీ డైరెక్టర్ పళ్ళెం అరుణ కుమారి సూచించారు. స్థానిక మహిళా సమాఖ్య భవనంలో మండల మహిళా సమాఖ్య నూతన కమిటీ శుక్రవారం ఏర్పడింది. కమిటీ అధ్యక్షురాలిగా బొర్రా సుజాత(చెరుకుమిల్లి), ఉపాధ్యక్షురాలిగా జంపన సుబ్బలక్ష్మి(దుంపగడప), కార్యదర్శిగా మద్దా సత్యవతి(సిద్ధాపురం), జాయింట్ సెక్రటరీగా కట్రెడ్డి పద్మావతి(పెదకాపవరం),కోశాధికారిగా దీపాటి సునీత(అజ్జమూరు)లతో కమిటీ ఏర్పడింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న అరుణకుమారి మాట్లాడుతూ మహిళలు వారి కాళ్ళపై వారు నిలబడే విధంగా ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం శేషవేణి, పోలిశెట్టి కనక దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నిర్మలమాత ఆలయ వార్షికోత్సవం



నిర్మల మాత విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

కాళ్ల: దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా చేస్తున్న సేవలు అభినందనీయమని గోకరాజు వెంకటశివరామరాజు అన్నారు. కాళ్ళ మండలం కాళ్లకూరు గ్రామంలో నిర్మలమాత మందిర 14వ వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మెమోరియల్ ట్రస్టు అధినేత వెంకటరామరాజు ఆర్థిక సహకారం రూ.4.50 లక్షలతో నిర్మించిన నిర్మలమాత పునర్నిర్మాణ మందిరాన్ని ప్రారంభించారు. అనంతరం సుమారు 2 వేల మందికి రామరాజు ఆర్థిక సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామరాజుతో పాటు గోకరాజు శివబాబు, గుండావత్తుల నాగేశ్వరరావు, అడ్డాల నాగరాజులను నాయకులు, సంఘపెద్దలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సోడదాసి గంగయ్య, పాస్టర్లు లక్కపాముల డేవిడ్, తోట గాబ్రియేలు తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు బహుమతుల అందజేత



బాలికలకు నగదు బహుమతి అందజేస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): అక్టోబర్ 11న అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో వివిధ ఉన్నత పాఠశాలలో వ్యాసరచన, వకృత్వ, చిత్రలేఖనం పోటీల్లో పాల్గొని గెలుపొందిన 9 మంది బాలికలకు రూ.30 వేల నగదు, జ్ఞాపికలను ప్రశంసా పత్రాలను శుక్రవారం కలెక్టరేట్ చాంబర్‌లో కలెక్టర్ చదలవాడ నాగరాణి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులను అభినందిస్తూ, చదువుతో పాటు అన్ని రంగాలలో రాణించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు, పి.అనంతలక్ష్మి, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ వీఎస్ఆర్‌కే కళ్యాణికుమారి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాకు ఎన్‌పీసీఐ లింకు తప్పనిసరి

భీమవరం (ప్రకాశంచౌక్): 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరి బ్యాంకు ఖాతాకు ఎన్‌పీసీఐ లింకు తప్పనిసరిగా కలిగి ఉండాలని భీమవరం పోస్టల్ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఎవీ సత్యనారాయణరాజు తెలిపారు. ఇప్పటికే బ్యాంకు, పోస్ట్ ఆఫీస్ అకౌంట్ ఉన్న వారు చాలా మంది వాటిని ఆధార్‌కు లింక్ చేయకపోవడం వలన ప్రభుత్వం ద్వారా వచ్చే సాయాన్ని పొందలేక పోతున్నారని తెలిపారు.

సమ సమాజ స్థాపనలో యువత పాత్ర కీలకం

భీమవరం: అవినీతి రహిత సమ సమాజ స్థాపనలో యువత కీలక పాత్ర పోషించాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భీమవరం బ్రాంచ్ చీఫ్ మేనేజర్ నిర్మలజ్యోతి అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భీమవరం శాఖ ఆధ్వర్యంలో విజిలెన్స్ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు న్యాయం చేయాలంటే యువత నడుం బిగించాలని ఇటీవల కాలంలో అరాచకాలు, అత్యాచారాలు, దోపిడీలు పెచ్చుమీరి నైతిక విలువలు దిగజారిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అవినీతి రహిత సమాజానికి యువత పాత్ర అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, కృష్ణ చైతన్య, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు

పాలకోడేరు: గ్రామాల్లో సామాజిక బంధాలను బలపరిచేందుకు, వ్యసనాలను తగ్గించడం వంటి వాటి కోసం ఈశా గ్రామోత్సవం పేరిట అతి పెద్ద క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఈషా ఫౌండేషన్ పాలకోడేరు మండలం ఏపీఎం భారతి తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ పోటీలు డివిజన్ స్థాయి నుంచి ప్రారంభమవుతాయని, ఆసక్తి ఉన్న వారు నవంబర్ 8 వరకు క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకోవాలని వివరించారు. 16 నుంచి 75 ఏళ్ల వయసు వరకూ పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

పేదలకు విద్యుత్ సరఫరా నిలిపివేత దారుణం



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న బాధితులు

ఆకివీడు: స్థానిక అయిభీమవరం రోడ్డులోని ఆక్రమణదారుల ఇళ్లు అన్యాయంగా తొలగిస్తున్నారని, విద్యుత్ సరఫరా నిలిపేసి దారుణానికి పాల్పడుతున్నారని పలువురు బాధితులు సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి కె.తవిటినాయుడు మాట్లాడుతూ ఆక్రమణల తొలగింపునకు గడువు ఇవ్వాలని కోరినందుకు ఇళ్ల కరెంట్ తీసివేసి హింసిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా బ్రిటీష్ పాలనను గుర్తు చేసే విధంగా ఆక్రమణల తొలగింపు చర్యలు చేపడుతున్నారని వాపోయారు. పేదల ఇళ్లనే తొలగిస్తూ, పెద్దల జోలికి వెళ్లకుండా బడా బాబులను కాపాడుతున్నారని ఆరోపించారు. చట్ట ప్రకారం సమయం ఇచ్చి, వసతులు కల్పించి పేదల ఇళ్లు ఖాళీ చేయించాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా అధికారులు, పాలకులు పాల్పడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సందక సూరిబాబు, దోకల రవితేజ, గేదల ధనుష్, విజయలావణ్య, పెంకి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలను అరికట్టాలి



ప్రజాపోరు ప్రచారాన్ని నిర్వహిస్తున్న సీపీఎం నేతలు


భీమవరం: అధిక ధరలను అరికట్టాలని, మహిళలు, పిల్లలు, దళితులపై అత్యాచారాలు అరికట్టాలని భీమవరం పట్టణంలోని వివిధ వార్డుల్లో శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాపోరు ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భీమవరం పార్టీ పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు మాట్లాడుతూ ధరలు అదుపు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఈ నెల 15న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జక్కంశెట్టి సత్యనారాయణ, ఎం.వైకుంఠరావు, బొక్కా సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, డి.త్రిమూర్తులు, డి.నాగేశ్వరరావు, కె.కృష్ణ, ఎ.రాంబాబు పాల్గొన్నారు.

భీమవరం అర్బన్: సీపీఎం కేంద్ర కమిటీ పిలుపు మేరకు ప్రజా సమస్యలు పరిష్కారానికై ఈ నెల 11, 12లలో ప్రజా పోరు ప్రచార యాత్రను ప్రజలందరూ విజయవంతం చేయాలని సీపీఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాసరావు కోరారు. తోకతిప్పలో ఈ మేరకు సమావేశం నిర్వహించారు.

12 నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపులు

భీమవరం(ప్రకాశం చౌక్): ఈ నెల 12 తేదీ నుంచి ఆపార్ ఐడీ జనరేషన్‌కు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాల విద్యార్థులకు అపార్ ఐడీ జనరేషన్ చేయుటకు అవసరమైన ఆధార్ కార్డు డేటా సవరణలకు అన్ని మండలాల, మున్సిపాలిటీల్లోని గ్రామ, వార్డు సచివాలయాల్లో 90 ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఆధార్ సెంటర్లలో నవంబర్ 12 నుంచి 28 వరకు 15 రోజుల పాటు ప్రత్యేక మొబైల్ ఆధార్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు. ఆచంట రూరల్ 2, ఆకివీడు 4, అత్తిలి రూరల్ 3, భీమవరం రూరల్ 6, భీమవరం అర్బన్ 4, యలమంచిలి 4, గణపవరం 4, ఇరగవరం రూరల్ 3, కాళ్ల 4, మొగల్తూరు 4, నరసాపురం అర్బన్ 4, నరసాపురం రూరల్ 3, పాలకొల్లు రూరల్ 4, పాలకొల్లు అర్బన్ 3, పాలకోడేరు 3, పెంటపాడు 2, పెనుగొండ 3, పెనుమంట్ర 3, పోడూరు 4, తాడేపల్లిగూడెం రూరల్ 4, తాడేపల్లిగూడెం అర్బన్ 4, తణుకు రూరల్ 2, తణుకు అర్బన్ 6, ఉండి 3, వీరవాసరం 4 ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు, తల్లితండ్రులు ఈ ప్రత్యేక ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

ఆయుష్మాన్ భారత్ పథకంలో ఆసుపత్రులు పెంచాలి



బొబ్బిలి బంగారయ్య

ఆకివీడు: ఆయుష్మాన్ భారత్ పథకం అమలుకు ఆసుపత్రుల సంఖ్యను పెంచాలని వినియోగదారుల రక్షణమండలి రాష్ట్ర సభ్యులు, రాష్ట్ర వృద్ధుల సంక్షేమ సంఘం రాష్ట్ర సలహాదారులు బొబ్బిలి బంగారయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ పథకం వయో వృద్ధులకు మరింతగా అందుబాటులోకి వచ్చేందుకు ఆసుపత్రుల సంఖ్యను పెంచాలన్నారు. రాష్ట్రంలో ఒక్క మంగళగిరిలోని ఆసుపత్రిలోనే ఈ పథకం ద్వారా ఆరోగ్య సేవలందిస్తున్నారని చెప్పారు. 50 లక్షలకు పైగా వృద్ధులున్న రాష్ట్రంలో ఒకే ఒక్క ఆసుపత్రి వల్ల వృద్ధులకు న్యాయం జరగదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీ జిల్లాలో ఆరోగ్య శ్రీ పథకంలోలా ఆయుష్మాన్ భారత్ పథకం వర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని బంగారయ్య విజ్ఞప్తి చేశారు.

కొబ్బరిలో నల్లముట్టి పురుగును నివారించాలి

ఉండి: కొబ్బరిసాగులో ప్రస్తుతం విపరీతంగా ఆశిస్తున్న నల్లముట్టి పురుగును నివారించేందుకు కొబ్బరి రైతులంతా ముందుకు రావాలని కేవీకే ప్రోగ్రాం కోర్డినేటర్ డాక్టర్ ఎన్.మల్లికార్జునరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఇటీవల అంబాజీపేట శాస్త్రవేత్తలతో సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో కొబ్బరిసాగులో తలెత్తే వివిధ సమస్యలపై రైతులతో చర్చించినట్లు పేర్కొన్నారు. ఆక్వా చెరువుల వద్ద మరికొన్ని ప్రాంతాల్లో వరి పొలాలల్లోని కొబ్బరి చెట్టుకు నల్లముట్టి పురుగు ఆశించడం ఎక్కువగా గమనిస్తున్నామమని, దీంతో కొబ్బరిచెట్లు కాలిపోయిన వాటిలా తయారవుతున్నాయని పేర్కొన్నారు. తెగులు ఆశించిన చెట్టు ఆకులు ఎండిపోవడం, వాలిపోవడం, దూరం నుంచి చూసినప్పుడు తోట కాలిపోయిన మాదిరి కనిపిస్తుందని వివరించారు. ఈ సమస్యను అరికట్టేందుకు రైతులంతా సామూహికంగా జీవనియంత్రణ పద్ధతులను పాటించాలని సూచించారు. పురుగు ఆశించిన, ఎండిన ఆకులను అడుగు వరస ఆకులను తీసి కాల్చివేయాలని పేర్కొన్నారు. నల్లముట్టి పురుగు 2,3 దశల్లో తక్కువ స్థాయిలో ఉన్నప్పుడు చెట్టుకు ఒకటి లేదా రెండు ఆకులు ఆశించినప్పుడు బ్రీకాన్ బ్రెవీకార్నిస్ అనే మిత్రపురుగును చెట్టుకి 30 చొప్పున వదలాలని పేర్కొన్నారు.